# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-10-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. నదులను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.**

**2. రాష్ట్రవ్యాప్తంగా కేంద్రీకృత వంటశాలలను డిసెంబర్ 9న ఒకేసారి ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**3. రాయలసీమ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుతో ప్రకాశం జిల్లా ఉద్యాన రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.**

**4. బాల కార్మికులతో వెట్టి చాకిరీ చేయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు.**

==========================

నదులను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. విజయవాడలో నిన్న నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛత అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని.. ఐదు కోట్ల మంది ప్రజలు భాగస్వాములై ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగితేనే రాష్ట్రంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని అన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి నీరు అందించడంతో పాటు మురుగునీటి శుద్ధికి రాష్ట్రవ్యాప్తంగా సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొంటూ..

వాయిస్.. 29

--------------------------

రాష్ట్రవ్యాప్తంగా కేంద్రీకృత వంటశాలలను డిసెంబర్ 9న ఒకేసారి ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహార పథకం అమలుకు ముఖ్యమంత్రి సమక్షంలో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నాయి. నవంబర్ 30వ తేదీలోగా కేంద్రీకృత వంటశాలల ఏర్పాట్లను పూర్తిచేయాలని సూచించారు. వంటశాలల్లో ఆహారం తయారీ విధానం, పరిశుభ్రత, నాణ్యత వంటి అంశాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల

శారీరక ఎదుగుదల, విద్యా ప్రగతి తదితర అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని చెప్పారు. విద్యార్థులకు అందించే ఆహారంలోని కేలరీలను లెక్కించేందుకు సాంకేతిక ఆధారిత అనువర్తనాలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.

-------------------------

హార్టికల్చర్ హబ్ ఏర్పాటుతో ప్రకాశం జిల్లా ఉద్యాన రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఒంగోలు కలెక్టరేట్ లో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు ఉద్యాన రంగా అభివృద్ధికి ఊతమిస్తుందన్నారు. ఉద్యాన పంటలకు మార్కెటింగ్, ఉత్పత్తుల విలువ పెంపునకు, మౌలిక వసతుల కల్పన అవకాశం లభిస్తుందని చెప్పారు. హార్టికల్చర్ హబ్ ద్వారా ప్రకాశం జిల్లాకు సుమారు 601 కోట్ల రూపాయల మేర నిధులు లభిస్తాయని పేర్కొంటూ..

వాయిస్... 29

-------------------------

బాల కార్మికులతో వెట్టి చాకిరీ చేయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. చదువుకోవాల్సిన వయసులో చిన్నారులు కూలి పనులు చేస్తూ తమ బంగారు భవిష్యత్తును కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. బాలలను పనుల్లో పెట్టుకునే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి బాలల హక్కుల పరిరక్షణకు సహకరించాలని మంత్రి కోరారు.

-------------------------

గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో రేపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నిన్న బుర్రిపాలెంలో పర్యటించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా త్రీడీ సాంకేతికతతో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగ సభ ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

-------------------------

విజయవాడలో ఈ రోజు  నిర్వహిస్తున్న 'పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సదస్సు'కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. ఈ సదస్సుకు కార్పొరేట్ సీఈఓలు, పెట్టుబడిదారులు, ఐఐటీల డైరెక్టర్లు, ఐటీ రంగానికి చెందిన నిపుణులు 800 మందికిపైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ ఉదయం సదస్సును ఆంధ్రప్రదేశ్ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించనుండగా, సదస్సులో వివిధ  అంశాలపై ప్యానల్ చర్చలు జరుగుతాయి. వీటితో పాటు మూడు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తారు. ముగింపు సమావేశంలో ఈ సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారు.

రాష్ట్ర రాజధాని అమరావతి అత్యంత సురక్షితమైనదని, నిర్మాణ పనులు పూర్తయితే బొట్టు నీరు కూడా నిల్వ ఉండదని మంత్రి నారాయణ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నిన్న శంకుస్థాపన చేసిన ఆయన మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణంతో పాటు రాష్ట్రవ్యాప్త అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజధాని నిర్మాణంలో వరద ముప్పు లేకుండా ఉండేందుకు గత 200 ఏళ్ల వర్షపాత గణంకాలు, వాతావరణ సరళులను క్షుణ్ణంగా అధ్యయనం చేశామని ఆయన తెలిపారు. నెదర్లాండ్స్ దేశ నిపుణులతో చర్చించి, వారి మార్గదర్శకత్వంలో పటిష్టమైన వరద నియంత్రణ వ్యవస్థను రూపకల్పన చేశామని మంత్రి నారాయణ వెల్లడించారు.

---------------------------

హైదరాబాద్ నగర వీధుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ నిత్యావసరాలు, ఆహారాన్ని చేరవేస్తున్న గిగ్ వర్కర్ల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి తెలిపారు. హైదరాబాద్ కొండాపూర్‌లో గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'అప్జీ హౌస్' విశ్రాంతి కేంద్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల చట్టాన్ని తీసుకువచ్చినట్లు వెల్లడించారు. కార్మికులు విరామ సమయంలో సేద దీరడానికి, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం చేయడానికి ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

---------------------------

సుదీర్ఘకాలంగా అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న 70 మంది వైద్యులను విధుల నుంచి తొలగించినట్లు ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు తెలిపారు. ఏడాదికి పైగా విధులకు హాజరుకాని వీరికి ప్రభుత్వ సివిల్ సర్వీసు నిబంధనల ప్రకారం సంజాయిషీ నోటీసులు జారీ చేసి, నిబంధనలను అనుసరించిన అనంతరం తుది చర్యగా విధుల నుంచి తొలగించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనలు ప్రకారం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలగించిన వారంతా సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదాలో ఉన్నారని పేర్కొన్నారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం  విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్ర అధికారి సిహెచ్. నాగభూషణం పేర్కొన్నారు. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం ఈరోజు తేలికపాటి నుండి నుండి మోస్తరు వర్షాలు  లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల  కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్.. 22

మరోవైపు తెలంగాణలో రానున్న 3 రోజుల పాటు పొడివాతావణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================